## క్లుప్తంగా

### అయ్యప్ప దీక్ష స్వీకరణ



గండేడ్/మహమ్మదాబాద్: మహమ్మదాబాద్ మండల కేంద్రం శివారులో కాంతిమల శిఖరం, అయ్యప్పస్వామి కొండపై గురువారం పలువురు భక్తులు అయ్యప్పస్వామి దీక్షను స్వీకరించారు. మహమ్మదాబాద్ మండలంతో పాటు గండేడ్, హన్వాడ మండలాలకు చెందిన భక్తులకు అయ్యప్పస్వామి మాలాధారణ చేశారు. అనంతరం పూజా కార్యక్రమాలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

### ఓటమి భయంతోనే దాడులకు దిగారు



స్టేషన్ మహబూబ్‌నగర్: ఓడిపోతామనే భయంతో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలపై బీఆర్ఎస్ నాయకులు దాడులకు దిగుతున్నారని కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి యెన్నం శ్రీనివాస్‌రెడ్డి విమర్శించారు. జిల్లా కేంద్రంలోని శ్రీనివాసకాలనీలో టీజేఏసీ జిల్లా చైర్మన్ రాజేందర్‌రెడ్డి నివాసంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నియోజకవర్గంలో ప్రజాస్వామ్యం కొనసాగుతుందా? అని ప్రశ్నించారు. నియోజకవర్గంలో పోలింగ్ బూత్‌లో బోగస్ ఓటింగ్ జరుగుతుందని ఎన్నికల అధికారులకు తెలిపి బయటికి వచ్చినా రాజేందర్ రెడ్డిపై దాడులు చేయడం సరికాదన్నారు. ప్రజాస్వామ్యబద్ధంగా ఇతర పార్టీకి పనిచేస్తే వారిపై కక్షకట్టడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. కనీసం వయస్సు మీద గౌరవం లేదా, జిల్లాలో తెలంగాణ ఉద్యమాన్ని ఉవ్వెత్తున తీసుకొచ్చిన వ్యక్తిపై దాడులు చేయడం ప్రజాస్వామ్యానికి మాయని మచ్చ అన్నారు. దాడిపై రూరల్‌పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. సీపీఎం, సీపీఐ, సీఐటీయూ నాయకులు కిల్లె గోపాల్, సురేష్, కురుమూర్తి మాట్లాడుతూ రాజేందర్‌రెడ్డిపై దాడిని ఖండిసున్నట్లు తెలిపారు. రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ 100, 101 పోలింగ్ బూతులలో గుర్తింపు కార్డులు చూడకుండా బోగస్ ఓటింగ్ విషయాన్ని తెలుసుకుని వీటిని నిలిపివేయాలని ఎన్నికల అధికారులకు తెలియజేసి బయటకు వచ్చి నిలబడిన మరుక్షణమే నాపై దాడి చేసినట్లు తెలిపారు. నాపై దాడిచేసిన వ్యక్తిపై, అతడిని ప్రోత్సహించిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు.



కోడూరు గ్రామ బూత్ వద్ద బారులుదీరిన ప్రజలు



మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో..

# ఓట్ల పండుగ ముగిసింది



మాడల్ బేసిక్ స్కూల్‌లో..



పద్మావతీకాలనీలో



టీడీగుట్టలో..



వీరన్నపేటలో ఓటేసిన కాలనీవాసులు

- ఉత్సాహంగా ఓటు హక్కును వినియోగించుకున్న యువ ఓటర్లు
- కుటుంబాల సమేతంగా పోలింగ్ కేంద్రాలకు వచ్చిన ప్రధాన రాజకీయ పార్టీల అభ్యర్థులు
- మహబూబ్‌నగర్ నియోజకవర్గవ్యాప్తంగా 69.32 శాతం పోలింగ్ నమోదు



తిమ్మాసానిపల్లిలో క్యూలో నిల్చున్న మహిళా ఓటర్లు

మహబూబ్‌నగర్ రూరల్: మహబూబ్‌నగర్ నియోజకవర్గంలో చెదురు మదురు ఘటనలు మినహా అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. భారీ పోలీసు బందోబస్తు మధ్య ఉదయం 7 గంటలకు ప్రారంభమైన పోలింగ్ సాయంత్రం పొద్దుపోయే వరకు కొనసాగింది. కొన్ని కేంద్రాల్లో సాయంత్రం 4 గంటల వరకే పోలింగ్ ముగియగా, మరికొన్ని కేంద్రాల్లో 5 గంటల వరకు క్యూలైన్‌లో నిలిచి ఉన్న ఓటర్లకు ఓటు వేసుకునే అవకాశం కల్పించడంతో రాత్రి పొద్దుపోయే వరకు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా రాత్రి 10:30 గంటల వరకు అందిన సమాచారం ప్రకారం 69.32 శాతం పోలింగ్ నమోదైంది. బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థులు శ్రీనివాస్‌గౌడ్, యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, మిథున్‌కుమార్‌రెడ్డిల గెలుపు కోసం ఆయా పార్టీల నాయకులు, కార్యకర్తలు పోలింగ్ ముగిసే సమయం వరకు అవిశ్రాంతంగా కృషి చేశారు. ఈ ఎన్నికల్లో యువత ఉత్సాహంగా ఓటింగ్‌లో పాల్గొనడంతో ఓటింగ్ శాతం భారీగా నమోదైంది. ఈ ఎన్నికల్లో ఓటర్లను తమ వైపుకు తిప్పుకోవడానికి ప్రధాన రాజకీయ పార్టీల నాయకులు విచ్చలవిడిగా మద్యం, డబ్బు పంపిణీ చేశారు. నియోజకవర్గంలో ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా ముగియడంతో రాజకీయ పార్టీల నాయకులు, అధికారులు ఊపిరి పీల్చుకున్నారు.

## కేంద్రాలకు ఓటర్ల బారులు

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: పాలమూరు నియోజకవర్గ పరిధిలోని 49 వార్డులలో గురువారం ఉదయం ఏడు గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు పోలింగ్ ప్రశాంతంగా కొనసాగింది. ముఖ్యంగా పురుషులతో పాటు మహిళలు ఉత్సాహంగా తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకున్నారు. 18ఏళ్లు నిండి కొత్తగా ఓటు హక్కు పొందిన యువతీ యువకులతో పాటు వయోవృద్ధులు తమకు కేటాయించిన పోలింగ్ కేంద్రాలలో ఓటేశారు.

స్టేషన్ మహబూబ్‌నగర్: కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి యెన్నం శ్రీనివాస్‌రెడ్డి జిల్లా కేంద్రం పద్మావతీకాలనీలోగల ప్రతిభ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన 103 పోలింగ్ బూత్‌లో ఓటేశారు. షాసాబ్‌గుట్టలోని 125 బూత్‌లో రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఇంతియాజ్ ఇసాక్, పద్మావతీకాలనీలో టీపీసీసీ ఉపాధ్యక్షుడు ఒబేదుల్లా కొత్వాల్ ఓటు హక్కును వినియోగించుకున్నారు.



వీరన్నపేటలో బయటకు వస్తున్న వృద్ధురాలు



గాంధీ రోడ్డు స్కూల్ వద్ద..



కోడూర్‌లో ఓటేసిన జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేశ్వర్‌గౌడ్



ఎనుగొండలో ఓటేసి వస్తున్న వృద్ధుడు

### కోయిల్‌కొండలో 80శాతం



శేరివెంకటాపూర్‌లో ఓటు హక్కును వినియోగించుకున్న ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి, కుటుంబ సభ్యులు

కోయిల్‌కొండ: మండలంలోని 44 పంచాయతీలలో ప్రశాంతంగా పోలింగ్ ముగిసింది. నారాయణపేట నియెజకవర్గ ఎమ్మెల్యే ఎస్.రాజేందర్‌రెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి మండలంలోని శేరివెంకటాపూర్‌లోని 59వ బూత్‌లో ఓటు హక్కును వినియోగించుకున్నారు. మండలంలో 80శాతం పోలింగ్ నమోదైనట్లు తహసీల్దార్ భరత్‌గౌడ్ తెలిపారు.



### సాయంత్రం 6 దాటినా..

హన్వాడ: మండలంలో అసెంబ్లీ ఎన్నికలు లోకల్ ఎన్నికలను తలపించాయి. ఉదయం ఎన్నికలు ప్రారంభమైన గంటలోపే ఓటర్లు పోలింగ్ కేంద్రాల వద్ద బారులు తీరారు. హన్వాడ, పెద్దదర్పల్లిల్లో ఓటర్లు సాయంత్రం 6గంటలు దాటినా క్యూలైన్ లో నిల్చుకుని తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.

**పోలింగ్ కేంద్రాల సందర్శించిన అభ్యర్థులు**

కాంగ్రెస్, బీఆర్ఎస్ అభ్యర్థులు యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్ పెద్దర్పల్లి, హన్వాడ తదితర గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను సందర్శించి ఎన్నికల సరళిని పరిశీలించారు. అభ్యర్థులు పోలింగ్ కేంద్రంలో ఓటుహక్కు వినియోగించుకునేందుకు క్యూలైన్‌లో నిలబడిన ఓటర్లను నమస్కరిస్తూ తమకు ఓటు వేయాలని విజ్ఞప్తి చేశారు.



హన్వాడలో ఓటేసేందుకు వస్తున్న వృద్ధురాలు

# దేవరకద్రలో సజావుగా పోలింగ్



దేవరకద్రలో ఓటు వేసిన బీజేపీ అభ్యర్థి కొండ ప్రశాంత్‌రెడ్డి

దేవరకద్ర: నియోజకవర్గం నుంచి పోటీ చేసిన ప్రధాన పార్టీ అభ్యర్థులు గురువారం ఎన్నికల్లో తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. దేవరకద్ర ఎమ్మెల్యే బీఆర్ఎస్ అభ్యర్థి ఆల వెంకటేశ్వర్‌రెడ్డి, ఆల మంజుల దంపతులతో పాటు వారి కుమార్తెలు భూత్పూర్ మండలం అన్నాసాగర్‌లో ఓటు హక్కు వినియోగించుకున్నారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి మధుసూదన్‌రెడ్డి ఆయన భార్య కవిత చిన్నచింతకుంట మండలం దమగ్నపూర్‌లో ఓటు వేశారు. బీజేపీ అభ్యర్థి కొండ ప్రశాంత్‌రెడ్డి, వారి తల్లి దేవరకద్ర సర్పంచ్ కొండ విజయలక్ష్మి దేవరకద్రలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ బూత్‌లో ఓటు వేశారు.



చిన్నచింతకుంటలో క్యూలో నిల్చున్న ఓటర్లు

### అన్ని రకాల ఏర్పాట్లు

చిన్నచింతకుంట: మండలంలో ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లకు ఇబ్బందులు కలగకుండా అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. మండలంలో 29,817 మంది ఓటర్లకు గాను 25,595 మంది 84 శాతం తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. కొన్ని పోలింగ్ కేంద్రాల వద్ద 7 గంటల వరకు కొనసాగింది. చిన్నచింతకుంటలోని 201 పోలింగ్ కేంద్రం వద్ద ఈవీఎం మిషన్లు మొరాయించడంతో ఓటర్లు కొంత ఇబ్బంది పడ్డారు. చిన్నచింతకుంటలోని 202 పోలింగ్ కేంద్రంలో జెడ్పీ చైర్‌పర్సన్ స్వర్ణసుధాకర్‌రెడ్డి ఓటేశారు. బీఆర్ఎస్ అభ్యర్థి ఆలవెంకటేశ్వర్‌రెడ్డి పోలింగ్ కేంద్రాలను సందర్శించి ఓటింగ్ సరళిపై పార్టీ నాయకులను అడిగి తెలుసుకున్నారు.

# జడ్చర్లలో 73.8 శాతం పోలింగ్

జడ్చర్ల/జడ్చర్ల టౌన్: నియోజకవర్గంలో అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. ఉదయం 7 గంటల నుంచి ప్రారంభమైన పోలింగ్ సాయంత్రం 5 గంటల దాక కొనసాగింది. కొన్ని పోలింగ్ కేంద్రాల పరిధిలో ఓటర్లు సాయంత్రం పోలింగ్ ముగిసే సమయానికి కేంద్రానికి చేరుకోవడంతో ఆలస్యం చోటు చేసుకుంది. 5 గంటలలోపు పోలింగ్ కేంద్రానికి చేరుకున్న ఓటర్లకు స్లిప్పులు ఇచ్చి వారికి ఓటు వేసేందుకు అధికారులు అనుమతినిచ్చారు. పోలింగ్ ముగిసే సమయానికి నియోజకవర్గంలో 81.18 శాతంగా పోలింగ్ నమోదైనట్లు అధికారులు తెలిపారు. మండలంలోని ఉదండాపూర్‌లో రాత్రి 7:30గంటల వరకు పోలింగ్ కొనసాగింది.

**స్వల్ప ఉద్రిక్తత**

బాదేపల్లి గాంధీచౌరస్తా వద్ద గల పోలింగ్ కేంద్రంలో బీఆర్ఎస్ నాయకుడు శ్రీనివాస్‌యాదవ్‌పై పోలీసులు లాఠీ ఝులిపించారు. దీంతో ఆ కేంద్రం వద్ద స్వల్ప ఉద్రిక్తత చోటు చేసుకుంది. బాదేపల్లి సింగిల్‌విండో కార్యాయలంలోని పోలింగ్ కేంద్రాలతో పాటు కోడ్గల్ పోలింగ్ కేంద్రంలో రాత్రి 8 గంటల తర్వాత కూడా పోలింగ్ కొనసాగింది.



బాదేపల్లి పోలింగ్ కేంద్రం వద్ద ..

**దివ్యాంగులకు ఇబ్బందులు**

పోలింగ్ కేంద్రాల వద్ద వచ్చిన దివ్యాంగులకు అక్కడక్కడ ఇబ్బందులు ఎదురయ్యాయి. స్థానిక సెయింట్ ఆగ్నెస్ స్కూల్‌లోని కేంద్రంలో వీల్ చైర్ సౌకర్యం లేకపోవడంతో రోడ్డుపై నుండి దాదాపు 200 అడుగుల దూరంలో ఉన్న కేంద్రానికి ఇబ్బందులు పడుతూ వచ్చి ఓటు హక్కును వినియోగించుకున్నారు.



కోడ్గల్‌లో రాత్రి 8గంటల తర్వాత క్యూలో ఉన్న ఓటర్లు

**కలెక్టర్ పరిశీలన**

కలెక్టర్ రవినాయక్ మండలంలో పోలింగ్ కేంద్రాలను సందర్శించి పరిస్థితిని సమీక్షించారు. మున్సిపాలిటీ పరిధిలోని బూరెడ్డిపల్లిలో పోలింగ్ కేంద్రాన్ని ఆయన పరిశీలించి ప్రక్రియను అడిగి తెలుసుకున్నారు. ఓటర్ల వద్ద ఉన్న స్లిప్పులను ఆయన పరిశీలించారు.

## తండాలో 'వరుస' తగ్గలే..



బలీదుపల్లిలో చీకట్లో నిలబడ్డ ఓటర్లు



అడ్డాకుల మండలం తిమ్మాయిపల్లితండాలో వరుస కట్టిన ఓటర్లు

అడ్డాకుల: మండలంలోని తిమ్మాయిపల్లి తండాలో గురువారం ఓట్లు వేయడానికి గిరిజనులు గంటల తరబడి వరుసలో నిలబడాల్సి వచ్చింది. తండాలో 1,149 మంది ఓటర్లు ఉండగా ఒక్క పోలింగ్ బూత్‌ను(99వ నంబర్) మాత్రమే ఏర్పాటు చేశారు. దీంతో ఉదయం పోలింగ్ మొదలైన సమయం నుంచి సాయంత్రం 5 గంటలకు వరకు వరుస తగ్గలేదు. గంటల కొద్ది వేచి ఉండాల్సి రావడంతో గిరిజన మహిళలు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొన్నారు. వనపర్తి నియోజకవర్గ పరిధిలోని అడ్డాకుల మండలం బలీదుపల్లిలో రాత్రి 7గంటల వరకు పోలింగ్ కొనసాగింది. గ్రామంలో 1,136 మంది ఓటర్లు ఉండగా ఒక్క పోలింగ్ కేంద్రాన్ని(53వ నంబర్) మాత్రమే ఏర్పాటు చేయడంతో రాత్రి 7 గంటల వరకు పోలింగ్ కొనసాగింది. దీనివల్ల ఓటర్లు ఇబ్బందులకు గురయ్యారు. అడ్డాకుల మండలంలో 20,109 మంది ఓటర్లు ఉండగా 17,193 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. 85.50శాతం పోలింగ్ నమోదైనట్లు అధికారులు తెలిపారు. మూసాపేట మండలంలో 16,367 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోగా 83.26శాతం పోలింగ్ నమోదైంది.

## 3 నియోజకవర్గాల్లో అన్ని సౌకర్యాలు

- కలెక్టర్ రవినాయక్

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: శాసనసభ ఎన్నికల పోలింగ్ సందర్భంగా కలెక్టర్ జి.రవినాయక్ గురువారం ఉదయం ఏడు గంటలకే జిల్లా కేంద్రంలోని కలెక్టర్‌బంగ్లా చౌరస్తా వద్ద ఉన్న పోలింగ్ కేంద్రం నం. 222 లో క్యూలైన్‌లో నిలుచుని తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. అనంతరం విలేకరులతో ఆయన మాట్లాడుతూ జిల్లాలోని మహబూబ్ నగర్, జడ్చర్ల, దేవరకద్ర అసెంబ్లీ నియోజకవర్గాలలో ప్రజలు ఓటు వేసేందుకు అన్ని సౌకర్యాలు కల్పించామన్నారు. ఉదయం ఏడు గంటలకే జిల్లాలోని 835 కేంద్రాలతో పాటు మరో మూడు చోట్ల పోలింగ్ ప్రారంభమైందన్నారు. ఆయా కేంద్రాల్లో మహిళలు, పురుషులకు ప్రత్యేక క్యూలైన్లు, టాయిలెట్లు, 80 ఏళ్లు పైబడిన వారికి హోమ్ ఓటింగ్ సౌకర్యాలు కల్పించామన్నారు. ఓటర్లందరూ నిర్భయంగా వారి ఓటు హక్కును వినియోగించుకునేలా ఏర్పాట్లు చేశామన్నారు.

**ఓటేసిన ప్రముఖులు**

బీఆర్ఎస్ అభ్యర్థి, రాష్ట్ర ఎక్సైజ్, క్రీడల శాఖ మంత్రి వి.శ్రీనివాస్‌గౌడ్, కుటుంబ సభ్యులతో కలిసి శ్రీనివాసకాలనీలోని పోలింగ్ కేంద్రం నం. 100లో, బీజేపీ అభ్యర్థి ఏపీ మిథున్‌రెడ్డి బ్రిలియెంట్ గ్రామర్ స్కూల్‌లోని పీఎస్ నం.113లో ఓటు వేశారు. అలాగే డీసీసీబీ వైస్‌చైర్మన్ కె.వెంకటయ్య, మున్సిపల్ చైర్మన్ కేసీ నర్సింహులు ఎనుగొండలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో పీఎస్ నం.83లో ఓటు హక్కు వినియోగించుకున్నారు.



బూరెడ్డిపల్లిలో ఓటర్ల స్లిప్పులను పరిశీలిస్తున్న కలెక్టర్ రవినాయక్

### గంట ఆలస్యంగా..

నవాబుపేట: మండలంలో పోలింగ్ ఉదయం మందకోడిగా ప్రారంభమై అనంతరం పుంజుకుంది. 25 కేంద్రాల్లో పోలింగ్ గంట ఆలస్యమైంది. యన్మన్‌గండ్లలో రాత్రి 8 గంటల వరకు, లోకిరేవులో రాత్రి 9 గంటల వరకు పోలింగ్ కొనసాగింది. మండలంలో 78 శాతం పోలింగ్ నమోదైంది.

### మిడ్జిల్ మండలంలో..



మిడ్జిల్: మండలంలో మొత్తం 24,257 ఓట్లకు గాను 20,697 మంది ఓటు హక్కును వినియోగించుకోవడంతో 85.32 శాతం పోలింగ్ నమోదైనట్లు ఎన్నికల అధికారి రాజునాయక్ తెలిపారు. మండలంలో ప్రశాంతంగా ఎన్నికలు ముగిశాయి. రాత్రి 7 గంటల వరకు పోలింగ్ కొనసాగింది. ఎన్నికల సరళిని బీఆర్ఎస్ అభ్యర్థి లక్ష్మారెడ్డి, కాంగ్రెస్ అభ్యర్థి అనిరుధ్‌రెడ్డి పరిశీలించారు.



గొల్లపల్లిలో ఓటు వేసి వస్తున్న దివ్యాంగుడు

## సాయంత్రం దాటాక కూడా క్యూలోనే..



ఈద్గాన్‌పల్లిలో క్యూలో నిల్చున్న ఓటర్లు



మల్లేపల్లిలో మొదటి సారి ఓటు వేసిన పవిత్ర

రాజాపూర్: మండలంలో అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ 83.54 శాతం నమోదైంది. కల్లేపల్లిలో తక్కువగా 73.81 శాతం నమోదైంది. మండలంలో 21,964 వేల మంది ఓటర్లు ఉండగా 18,349 మంది ఓటర్లు ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈద్గాన్‌పల్లి, రంగారెడ్డిగూడలో డీసీఎంఎస్ చైర్మన్ ప్రభాకర్ రెడ్డి, దొండ్లపల్లి ఎంపీటీసీ అభిమన్యూరెడ్డి ఎన్నికల సరళిని పరిశీలించేందుకు వెళ్లగా, మా గ్రామంలోకి మీరెందుకు వచ్చారని? మీరేమైనా అభ్యర్థులా అంటూ కొందరు గ్రామస్తులు అడ్డు చెప్పగా వాగ్వివాదం చోటు చేసుకుంది. దీంతో పోలీసులు వారికి నచ్చజెప్పి అక్కడి నుంచి పంపించారు. మండల కేంద్రంతో పాటు పరిధిలోని తిర్మలాపూర్, చొక్కంపేట్, ఈద్గాన్‌పల్లి, రంగారెడ్డిగూడ తదితర గ్రామాల్లో అసెంబ్లీ ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. రాజాపూర్‌లో పోలింగ్ ఆలస్యంగా ప్రారంభమైంది. ఈద్గాన్‌పల్లిలో 5గంటలు దాటడంతో క్యూలో నిల్చున్నవారికి టోకెన్లు ఇచ్చి ఓటు వేయించారు.

### ఉత్సాహంగా పోలింగ్

బాలానగర్: మండలంలోని ఉడిత్యాల, నేరళ్లపల్లిలో చిన్నపాటి గొడవలు జరగడంతో పోలీస్‌ల జోక్యంతో సద్దుమనిగింది. మోతీఘణాపూర్‌లోని 71 పోలింగ్ బూత్‌లో ఈవీఎం ఎర్రర్‌తో మొరాయించగా సెక్టోరియల్ ఆఫీసర్ ప్రశాంత్ రెడ్డి సమస్యను పరిష్కరించడంతో అరగంట పాటు ఓటర్లు ఇబ్బందులు పడ్డారు. మండల కేంద్రంలోని పోలింగ్ కేంద్రాలను ఎన్నికలను కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి జనంపల్లి అనిరుధ్‌రెడ్డి, స్వతంత్ర అభ్యర్థి ట్రాన్స్‌జెండర్ జానకమ్మ పరిశీలించారు. మండలంలో రాత్రి 7గంటల వరకు పోలింగ్ బూత్‌ల వద్ద ఓటర్లు వేచి ఉండి మరీ ఓటు హక్కును వినియోగించుకున్నారు.



పెద్దాయపల్లిలో ఓటు హక్కును వినియోగించుకున్న ఓటర్లు